గణపురం: పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసిన మాజీ సర్పంచులు

మహదేవపూర్ : పోలీసులు అరెస్ట్ చేసిన మాజీ సర్పంచులు

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్

గణపురం/ మహదేవపూర్/ టేకుమట్ల, నవంబర్ 4 : పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తాజా మాజీ సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాజా మాజీ సర్పంచులను సోమవారం ఆయా మండలాల ఎస్సైలు రేఖ అశోక్, ప్రసాద్, కుమారస్వామి ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని శాంతియుత ధర్నా కార్యక్రమానికి సోమవారం హైదరాబాద్ వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేయడం ప్రభుత్వ దిగజారుడు విధానానికి నిదర్శనం అన్నారు. అసలు ఈ రాష్ట్రంలో ప్రజా పాలన జరుగుతుందా? లేక పోలీస్ పాలనా ? అని మండిపడ్డారు. పెండింగ్ బిల్లులు పూర్తిగా చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచులు నడిపెల్లి మధుసూదన్‌రావు, చెరుకు కుమారస్వామి, తోట మానసా శ్రీనివాస్, అయిలేని శశిరేఖా రామచంద్రారెడ్డి, రామంచ భద్రయ్య, శ్రీపతి బాపు, ఓడేటి పద్మా రవీందర్‌రెడ్డి, నాగుల లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు గునిగంటి మహేందర్, ప్రధాన కార్యదర్శి బిల్లా కంటి ఉమేందర్‌రావు, ఉద్దమారి మహేశ్, చదువు మహేందర్‌రెడ్డి, పండుగ శ్రీనివాస్ ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై విచారణ

- 50 ట్రిప్పులు ఇసుక డంప్ స్వాధీనం
- కలెక్టర్‌కు నివేదిక పంపనున్న తహసీల్దార్
- నమస్తే కథనానికి స్పందన

తాడ్వాయి, నవంబర్ 4 : మండలంలోని మేడారం జంపన్నవాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణాపై రెవెన్యూ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'అక్రమంగా ఇసుక రవాణా' కథనం ప్రచురితమవగా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. మేడారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కీసర రాజు జంపన్నవాగు వద్దకు చేరుకుని ఇసుక తరలించిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ఊరట్టం స్తూపం వద్ద సుమారు 50 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను గుర్తించి సీజ్ చేశారు. ఇసుకను మేడారానికి చెందిన ఓ కాంట్రాక్టర్ స్తూపం నుంచి ఊరట్టం వరకు సీసీ వేసేందుకు జంపన్నవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తీసుకొచ్చినట్లు గుర్తించామన్నారు. ఆర్ఐ ఇచ్చిన నివేదికలను కలెక్టర్‌కు పంపించనున్నట్లు చెప్పారు. ఇసుక లోడింగ్ చేసిన జేసీబీతో పాటు ట్రాక్టర్లపై కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని తహసీల్దార్ గిరిబాబు తెలిపారు. ఎవరైనా జంపన్నవాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అక్రమ ఇసుక డంప్ వద్ద ఆర్ఐ రాజు

బీఆర్ఎస్ గోరికొత్తపల్లి మండల అధ్యక్షుడిగా హమీద్

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిని ప్రకటిస్తున్న మాజీ ఎమ్మెల్యే

రేగొండ, నవంబర్ 4 : బీఆర్ఎస్ గోరికొత్తపల్లి మండల అధ్యక్షుడిగా ఎంఏ హమీద్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం పరకాలలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో మండల కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయగా అధ్యక్షుడిగా హమీద్‌ను కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కాశేటి మోహన్‌రావు, రేగుల మహేందర్, జాపాక దాస్, కూనూరు సదానందం, ప్రధాన కార్యదర్శులుగా దండబోయిన సంతోష్, తిప్పారపు శ్రీనివాస్, జాపాక భాస్కర్, కార్యదర్శులుగా ఒన్నాల శంకర్, మార్క కమలాకర్, కోశాధికారిగా మేకల సాంబయ్య, సభ్యులుగా లక్ష్మీకాంతం, తిరుపతి ఎన్నికయ్యారు. అనంతరం అనుబంధ కమిటీలను జ్యోతి, రమణారెడ్డి ప్రకటించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **CHANDRAMATHI DEVI IDULAPURAM** (Old Name) W/o **BOLLOJU VENKATESHWARLU** R/o H.No. 6-8-76, Brahmanawada, Hanamkonda, Hanumakonda Dist., TG., India Pin-506001 declare that I changed my name from **CHANDRAMATHI DEVI IDULAPURAM** (Old Name) to **PAVANI CHANDRAMATHI DEVI BOLLOJU** (New Name) and solemnly declare.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్, నవంబర్ 4 : ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ రెవెన్యూ 17, పింఛన్ 20, ఇందిరమ్మ ఇండ్లకు 3, ఉద్యోగ ఉపాధికి 7, ఇతర శాఖలకు సంబంధించి 15, మొత్తం 62 దరఖాస్తులు ప్రజల నుంచి వచ్చాయన్నారు. ప్రజావాణి, ప్రజాదర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సైతం త్వరగా పూర్తి చేయాలని, సమస్య ఉన్న వాటి కారణాలు తెలుసుకొని పరిష్కారం దిశగా ప్రయత్నించాలన్నారు. అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేశ్, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, డీసీవో సర్దార్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, డీఏవో తేజోవతి, డీడబ్ల్యూవో శిరీష, డీఎండీసీవో రాంపతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ దివాకర

గిరిజన దర్బార్‌లో వినతులు

ఏటూరునాగారం : ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి ఐటీడీఏ ఏవో భీంరావ్ వినతులు స్వీకరించారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మైలారం తండాలో తాగునీటికి పైపు లైన్ మంజూరు చేయాలని గ్రామస్తుడు బానోత్ ఈర్య ఆయనకు విన్నవించారు. మంగపేట మండలం మల్లూరు లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ పరిధిలోని సమ్మక్క-సారలమ్మ గుడి వద్ద బోరు, దేవుని కుంట వద్ద ఎర్రమ్మ, పోచమ్మ గుడి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని తాటి నర్సింగారావు కోరారు. ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ మండలాల్లో గిరిజన ఆదివాసీ ఇంటి స్థలాలకు ఎల్-ఫారం ద్వారా రిజిస్ట్రేషన్లు చేయాలని గోవిందరావుపేట మండలం పస్రా గ్రామానికి చెందిన ముద్దబోయిన రవి కోరారు. శంకరాజుపల్లిలోని గిరిజనేతరుల అటవీ భూములను స్వాధీన పర్చుకోవాలని మరో వినతిపత్రంలో రవి కోరారు. మంగపేట మండలంలో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని బీ భద్రు కోరారు. గిరిజన దర్బార్‌లో ఎస్‌వో రాజ్‌కుమార్, ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి, పెసా జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ములుగురూరల్/ మంగపేట/ వాజేడు/ వెంకటాపురం (నూగూరు) నవంబర్ 4 : జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ములుగు మండలం బండారుపల్లి, ఇంచర్ల, జంగాలపల్లి, బరిగలానిపల్లి గ్రామాల్లో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవిచందర్ హాజరై ప్రారంభించారు. ఆయన వెంట ఇంచర్ల పీఏసీఎస్ చైర్మన్ చిక్కుల రాములు, మాజీ చైర్మన్ సమ్మిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు చాంద్ పాషా, నల్లెల భరత్‌కుమార్, మాజీ ఎంపీటీసీ మావురపు తిరుపతిరెడ్డి ఉన్నారు. మంగపేట మండలం కమలాపురంలో మ్యాక్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సెంటర్ నిర్వాహకుడు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, బోరునర్సాపురం, తిమ్మంపేట, వాడగూడెం, అకినేపల్లిమల్లారం, వాగొడ్డుగూడెం, తిమ్మాపురం తదితర గ్రామాల కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, సీఈవో జగన్నాథరావు, వైస్ చైర్మన్ నరేందర్, డైరెక్టర్లు నర్రా శ్రీధర్, సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. రైతు బంధు సమితి మాజీ జిల్లా సభ్యుడు పచ్చా శేషగిరిరావు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వాత్సవాయి శ్రీధరవర్మ, రాణాప్రతాప్‌రెడ్డి, పూజారి రమేశ్ పాల్గొన్నారు. వాజేడు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ వీరభద్రప్రసాద్, సొసైటీ ఉపాధ్యక్షుడు వాత్సవాయి జగన్నాథరాజు, పేరూరులో సొసైటీ అధ్యక్షుడు యగ్గడి అంజయ్య ప్రారంభించారు. వాజేడు, ప్రగళ్లపల్లి, కడెకల్, ధర్మవరం, ఎడ్జర్లపల్లి, పూసూరు, చెరుకురు, శ్రీరాంనగర్, పేరూరు, ఘణపురం పదిచోట్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు అందుబాటులో ఉండేలా కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో సోమసత్యనారాయణ, డైరెక్టర్ పాయం శంకర్‌దయాళ్, ఏఈవోలు హరీశ్, జాఫర్, సిబ్బంది పాల్గొన్నారు. వెంకటాపురం(నూగూరు) మండలంలోని ఉప్పేడు, వీరాపురం, అలుబాక, సూరవీడు, వెంకటాపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు ప్రారంభించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

మంగపేట : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరెడ్డి

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

గణపురం, నవంబర్ 4 : మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన పంది కృష్ణాకర్, చెల్పూర్‌కు చెందిన జక్కు శ్రీనివాస్‌లు సెల్‌ఫోన్లు పోగొట్టుకోగా సోమవారం వారికి అందజేసినట్లు ఎస్సై రేఖ అశోక్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని గుర్తించి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.

తాడిచెర్ల ఓపెన్‌కాస్టు గని తనిఖీ

మల్హార్, నవంబర్ 4 : మండలంలోని తాడిచెర్ల-1 ఓపెన్ కాస్టు గనిని సోమవారం మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఆధ్వర్యంలో అధికారుల బృందం తనిఖీ చేసింది. కొత్తగూడెం సీసీవో ఓఎస్డీ డీవీ సుబ్రమణ్యం, బిలాస్‌పూర్ సీసీవో అవినాష్ శుక్ల, వరంగల్ నిట్ ప్రొఫెసర్ అజయ్ పటేల్, సింగరేణి భూపాలపల్లి సేఫ్టీ జీఎం రఘు కుమార్, టీజీ జెన్‌కో జీఎం మోహన్‌రావుతో కూడిన బృందం గని లోని పని స్థలాలను పరిశీలించింది. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసింది. రక్షణ చర్యలతో పాటు పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలకు స్టార్ రేటింగ్ ఇస్తూ ఏఎంఆర్ బృందం అభినందించింది. బృందంలో జెన్‌కో ఏజెంట్ జీవ కుమార్ కూడా ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ/ చిట్యాల, నవంబర్ 4 : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రేగొండ మండలకేంద్రంలో రైతు వేదికలో సోమవారం 43 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. చిట్యాల మండల కేంద్రం శివారులో ఏర్పాటుచేసిన బాల మురుగన్ కాటన్ ఇండస్ట్రీ, ఆంజనేయ ఆగ్రో ఇండస్ట్రీలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తదనంతరం ఎంపీడీవో కార్యాలయంలో 49 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామన్నారు. రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, పండించిన ప్రతి గింజా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే ధాన్యం అమ్మాలని సూచించారు. కార్యక్రమంలో రేగొండ తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, ఆర్ఐ నరేశ్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుంటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, జిల్లా నాయకులు నాయినేని సంపత్‌రావు, పున్నం రవి, మైస భిక్షపతి, మ్యాకల భిక్షపతి, జంగిటి సుధాకర్, మటికి సంతోష్, క్యాతం సదయ్య, చిట్యాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుట్ల తిరుపతి, పార్టీ జిల్లా కార్యదర్శి మధువంశీ కృష్ణ, టేకుమట్ల మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ఓరం సమ్మన్న, నాయకులు దొడ్డి కిష్టయ్య, బుర్ర లక్ష్మణ్‌గౌడ్, చిలుకల రాయకొమురు, కామెడీ రత్నాకర్‌రెడ్డి, పువ్వాటి వెంకన్న పాల్గొన్నారు. అలాగే సర్వే కోసం శిక్షణ ఇచ్చి తొలగించిన అంగన్‌వాడీ టీచర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎమ్మెల్యే జీఎస్ఆర్‌కు అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రం ఇచ్చారు. పైసలు ఇవ్వని సర్వేలు అంగన్‌వాడీ టీచర్లతో, డబ్బులు ఇచ్చే సర్వేకు ఉపాధ్యాయులను వాడుకోవడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సుజాత, ఎండీ రజియా, రమాదేవి, రజిత, సరోజన, లలిత ఉన్నారు.

రేగొండ : చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శానిటేషన్ సిబ్బందికి దుస్తుల పంపిణీ

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి దుస్తులు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా ఎమ్మెల్యే జీఎస్ఆర్ హాజరై అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బందికి దుస్తులు, దుప్పట్ల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కౌనిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి తాళం

స్థానికులనే నియమించాలని డిమాండ్

ఏటూరునాగారం, నవంబర్ 4 : మండలంలోని భూటారం అంగన్‌వాడీ కేంద్రానికి బదిలీపై వచ్చిన కార్యకర్త ఆదేశాలను రద్దు చేసి స్థానికులనే నియమించాలని కోరుతూ గ్రామస్తులు కేంద్రానికి తాళం వేశారు. వివరాలిలా ఉన్నాయి.. భూటారం అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న కార్యకర్త కొద్ది నెలల క్రితం మృతి చెందింది. కాగా, తాడ్వాయి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రంగాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త అక్కడ నుంచి భూటారం గ్రామానికి బదిలీపై వచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఈ పోస్టును స్థానికులతో భర్తీ చేయకుండా బదిలీపై మరొకరిని ఎలా నియమిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది గ్రామస్తులు కేంద్రం వద్దకు వచ్చి లోపల ఉన్న పిల్లలను బయటకు పంపించి తాళం వేశారు. మండలకేంద్రంలోని మానసపల్లిలోని సెంటర్‌లో ఖాళీగా ఉన్న పోస్టులో కూడా స్థానికులతో భర్తీ చేయకుండా బదిలీపై నియమించారు. దీంతో రెండు కేంద్రాల పరిధిలో ఉన్న వారంతా బదిలీలతో ఎలా భర్తీ చేస్తారని, స్థానికంగా అర్హులు ఉన్నప్పటికీ ఇతరులతో ఎలా భర్తీ చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఈవిషయంపై సీడీపీవో ప్రేమలతను వివరణ కోరగా బదిలీపై వచ్చిన వారు జాయిన్ అవుతున్నట్లు పేర్కొన్నారు. భూటారంలో గ్రామస్తులు తాళం వేయగా వారితో మాట్లాడి నచ్చచెప్పి అరగంటలో తెరిపించామని తెలిపారు.

కేంద్రానికి తాళం వేస్తున్న మహిళలు

కోటగుళ్లలో కార్తీక మాస ఉత్సవాలు

గణపురం, నవంబర్ 4: మండలకేంద్రంలోని కోటగుళ్లు, రెడ్డిగుళ్లలో కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి స్వామి వారికి రుద్రాభిషేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి నందీశ్వరుడికి పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయం రద్దీగా మారింది. కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు అడిషనల్ కలెక్టర్‌ను శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట ఎంపీడీవో ఎల్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి ఉమ్మల్ల విజేందర్ ఉన్నారు. అలాగే కోటగుళ్లలో నిర్వహించే కార్తీక మాస దీపోత్సవాల సందర్భంగా మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనాల ఉమా రాజమౌళి దంపతులు నూనె క్యాన్లను అందజేశారు.

ప్రత్యేక అలంకరణలో గణపేశ్వరస్వామి

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

తాడ్వాయి, నవంబర్ 4 : మండలంలోని కాటాపురం సమీపంలోని సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో టీఎస్‌పీఎస్‌సీ కానిస్టేబుల్ కొర్నిబెల్లి నరేశ్ గాయపడగా భద్రాద్రి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ దగ్గరుండి ఆస్పత్రికి తరలించారు. మండలంలోని కామారానికి చెందిన నరేశ్ చల్వాయిలో టీఎస్‌పీఎస్‌పీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం వ్యక్తిగత పనిపై కాటాపురానికి వెళ్లి రాత్రి తిరిగి ఇంటికి వస్తుండగా నాంపల్లి స్టేజి వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో నరేశ్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు కాటాపురం మీదుగా వెళ్తుండగా ప్రమాదాన్ని గమనించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అక్కడే ఆగి నరేశ్‌ను 108 వాహనంలో వైద్యం కోసం పంపించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సింగరేణి జీఎంగా రాజేశ్వర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

భూపాలపల్లి రూరల్, నవంబర్ 4 : సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా సోమవారం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మందమర్రి ఏరియాలో ఎస్‌వోటు జీఎంగా విధులు నిర్వర్తించిన ఆయన ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు. అనంతరం సుభాష్ కాలనీలోని సీతారామాంజనేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. తర్వాత అన్ని గనులు, విభాగాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. అంకిత భావంతో టీంవర్క్ చేసి భూపాలపల్లి ఏరియాకు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎస్ కవీంద్ర, సీఎంవోఏఐ ప్రెసిడెంట్, కేటికే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటరామరెడ్డి, ఏజెంట్ కేటీకే-1 వెంకటరమణ, ఏజీఎంలు జ్యోతి, రామకృష్ణ, డీజీఎంలు రవికుమార్, రాజరావు, డీవైసీఎంవో పద్మజ, సేఫ్టీ ఆఫీసర్ ప్రసాద్, కేటీకే ఓసీ- 3 మేనేజర్ భానుప్రసాద్, పర్సనల్ మేనేజర్ కే మారుతి, ఎస్ఈ పర్చేస్ ప్రదీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

రాష్ట్ర స్థాయి క్రీడలకు విద్యార్థినుల ఎంపిక

ములుగురూరల్, నవంబర్ 4 : ములుగు మండలం జగ్గన్నపేట గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ అజ్మీరా రాజు తెలిపారు. అండర్-17 వాలీబాల్‌లో సంజన, అండర్-14 షాట్‌పుట్‌లో జే ప్రవళిక, 100 మీటర్స్ రన్నింగ్‌లో శాలిని, వాలీబాల్‌లోస్వాతి, ఖోఖోలో లక్ష్మీభవాని, ఆర్చరీలో సంజన ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు.

ఎంపికైన విద్యార్థులతో ఫిజికల్ డైరెక్టర్ రాజు

ఎఫ్ఆర్వోకు బీఆర్ఎస్ నాయకుల వినతి

ములుగురూరల్, నవంబర్ 4 : మండలంలోని దేవగిరిపట్నం, పొట్లాపూర్, జగ్గన్నపేటతో పాటు పరిసర ప్రాంతాల్లోని రైతుల పంట పొలాలను అటవీ జంతువుల నుంచి కాపాడాలని కోరుతూ ఎఫ్ఆర్వో డోలి శంకర్‌కు సోమవారం బీఆర్ఎస్ నాయకులు గోవిందనాయక్, పాలెపు శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలను కాపాడడంతో పాటు అటవీ జంతువుల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూడాలని కోరారు. ఆయా గ్రామాల్లోని అటవీ అధికారులను సైతం అప్రమత్తం చేయాలని అన్నారు. జంతువుల వల్ల ధ్వంసమైన పంటలను అటవీ శాఖ అధికారులు పరిశీలించాలని కోరారు.

ఎఫ్ఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బైక్ బోల్తాపడి ఇద్దరికి స్వల్ప గాయాలు

మహదేవపూర్, నవంబర్ 4 : అదుపు తప్పి బైక్ బోల్తా పడి ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దాపూర్ గ్రామానికి చెందిన గట్టు సమ్మయ్య, రాపర్తి శ్రీనివాస్ సోమవారం బైక్‌పై మహదేవపూర్ నుంచి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని అయ్యప్ప టెంపుల్ వద్ద జాతీయ రహదారిపై ఉన్న గుంతలో బైక్ పడడంతో బోల్తా పడింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, స్థానికులు వారిని మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు చేయూత

కాటారం, నవంబర్ 4 : మండలకేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పలువురు ముందుకొచ్చారు. సోమవారం కిరాణా వర్తక సంఘం నాయకులు రూ.2 లక్షల చెక్కు, బట్టల వర్తక సంఘం నాయకులు రూ. 50వేలు, ఇటుక బట్టీల సంఘం నాయకులు రూ.30 వేలు కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్‌కు అందజేశారు. ఈ డబ్బులను సీసీ కెమెరాల ఏర్పాటు కమిటీని ఏర్పాటు చేసి వారి ఆధీనంలో ఉంచనున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

పీహెచ్‌సీ పరిశీలన

వెంకటాపూర్, నవంబర్ 4 : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు సందర్శించి, వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీకాంత్, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి అంకితభావంతో సేవలందించాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన మాతా శిశు ఆరోగ్యం, గర్భిణుల నమ